రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొడిమ్యాల, మే 24: నాచుపల్లి గ్రామానికి చెందిన చిన్న కొమురయ్య (42) గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న కొమురయ్య గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై పూడూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. పూడూర్ శివారులోకి రాగానే మల్యాలకు చెందిన గడుగు శివతేజ ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. కొమురయ్యకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్‌లోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు మృతి చెందాడు. కొమురయ్య భార్య అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కొడిమ్యాల, మే 24: చెప్యాలలోని హనుమాన్ ఆలయ చౌరస్తా వద్ద శుక్రవారం తెల్లవారుజామున వ్యాన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విరిగిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు.

గుంతను పూడ్చిన నాయకులు

కొడిమ్యాల, మే 24: పూడూర్ గ్రామంలో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై ఎల్లమ్మ ఆలయం ఎదుట బ్రిడ్జిపై గుంతను శుక్రవారం గ్రామానికి చెందిన నాయకులు, పోలీసులు సిమెంట్ కంకరతో పూడ్చి చేశారు. కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, రాజు, నాయకులు అనుమండ్ల అజయ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి,మే 24: ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీనరసింహస్వామితో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఆర్థిక సాయం

కొడిమ్యాల, మే 24: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన వేముల కొమురయ్య, ఒంటెద్దుల బాబు, చెనీ శారద ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజన్సింగరావు, నాయకులు శంకర్‌గౌడ్, అంజాగౌడ్, తిరుపతి, విక్రమ్‌గౌడ్, నవీన్, భరత్, లింగయ్య, తదితరులున్నారు.

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

మెట్‌పల్లి: రికార్డులను పరిశీలిస్తున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్
- మెట్‌పల్లి, కోరుట్ల దవాఖానల్లో తనిఖీలు

మెట్‌పల్లి/కోరుట్ల, మే 24: ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా వైద్యవిధాన పరిషత్ పని చేస్తున్నదని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల్లోని ప్రభుత్వ దవాఖానలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికలు, వసతులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యసేవలు, వైద్యులు, సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైద్యులు విధుల్లో నిర్లక్ష్యం చేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు ఉత్తమ వైద్య సేవలందించినప్పుడే ప్రజల్లో గుర్తింపు పొందడంతో పాటు ప్రభుత్వ దవాఖానకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఆయా దవాఖానల్లో వైద్యులతో సమావేశం నిర్వహించారు. మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖాన ఆవరణలో రూ.7.5 కోట్లతో నిర్మిస్తున్న నూతన భవనాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రెండు దవాఖానల్లో చేసిన ప్రసవాల వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా దవాఖానల సూపరింటెండెంట్లు డాక్టర్ సాజిద్ అహ్మద్, సునీతా రాణి, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ పెద్ద జయంతికి భారీ ఏర్పాట్లు

మాట్లాడుతున్న అంజన్న ఆలయ ఈవో చంద్రశేఖర్

- కొండగట్టు అంజన్న ఆలయ ఈవో చంద్రశేఖర్

మల్యాల, మే 24: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానంలో ఈ నెల 29 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహించే హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. కొండగట్టు ఆలయ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆలయ హోమగుండంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు సాంస్కృతిక కార్యక్రమాలను సైతం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, సునీల్, చంద్రశేఖర్, ఏఈఈ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉపాధి హామీ పనులకు సంబంధించిన నివేదికలను పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్, మే 24: కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఏడాదికాలంలో ఉపాధిహామీ పథకం కింద రూ. 3.81 కోట్ల పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. వీటిపై తనిఖీ బృందం సభ్యులు గ్రామాల వారీగా నివేదికలను ప్రజావేదికలో సమర్పించారు. కాగా, 16 మంది కార్యదర్శులు రూ. 49,181, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు రూ. 18,706, కంప్యూటర్ ఆపరేటర్లు రూ. 2 వేలు, ఏపీవో రూ. 8,893, ఎంపీడీవో నుంచి రూ. 3,856 నిధుల రికవరికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, డీఆర్డీఏ విజిలెన్స్ అధికారి చిన్నయ్య, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, విజిలెన్స్ అసిసెంట్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో శంకర్, ఎస్ఆర్‌పీ భగవంత్‌రావు, ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల రూరల్, మే 24: జగిత్యాల మండలం ధరూర్, హస్నాబాద్ గ్రామాలకు శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి రంజిత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మపూర్ గ్రామాలకు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

నాటుసారా విక్రేత బైండోవర్

జగిత్యాల, మే 24: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో నాటుసారా అమ్ముతూ పట్టుబడిన జూపల్లి రాజవ్వను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సర్వేశ్ తెలిపారు. రూ. 50 వేల జరిమానా విధించిగా, చెల్లించినట్లు పేర్కొన్నారు. నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేవాభావంతో పని చేయాలి



జగిత్యాల: మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో పేషెంట్‌తో మాట్లాడుతున్న రవీందర్ నాయక్

- రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్
- జిల్లాలోని పలు ప్రభుత్వ దవాఖానల తనిఖీ

జగిత్యాల, మే 24: వైద్యులు, సిబ్బంది సేవాభావంతో పని చేయాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ దవాఖానలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో అధికారులు, వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టు నిర్ధారణ కార్యక్రమం అమలు, బాధితులకు అందిస్తున్న పోషకాహారం వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని మోతేమాల వాడ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, ప్రోగ్రాం అధికారులతో జిల్లాలో వివిధ ఆరోగ్య కార్యక్రమాలు, మాతాశిశు ఆరోగ్య సేవా కార్యక్రమాలు, రాష్ట్రీయ బాలల సంరక్షణ, జాతీయ క్షయ నియంత్రణ, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. జిల్లాలోని 151 సబ్‌సెంటర్లలో సొంత భవనాలున్న వాటి వివరాలు, నిర్మాణ అనుమతులు పొందిన, నిర్మాణంలో ఉన్న వాటి వివరాలు డీపీవో స్వామిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందిన రాజ్‌కుమార్ మృతదేహాన్ని జిల్లా ప్రధాన దవాఖానలో సందర్శించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శ్రీధర్, ప్రోగ్రాం అధికారులు సమీయొద్దీన్, ఎస్ శ్రీనివాస్, ఏ శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం అధికారి స్వామి, వైద్యాధికారులు ప్రవీణ్ చంద్ర, స్వాతీల క్ష్మణ్, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, ఇన్‌చార్జి డిమో రమణ, ఆరోగ్య విద్యాబోధకుడు భూమేశ్వర్, సూపర్‌వైజర్లు మురళి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మేడిపల్లి పీహెచ్‌సీ తనిఖీ

మేడిపల్లి, మే 24: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, ఆరోగ్య కార్యక్రమాలు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ చంద్ర, ప్రోగ్రామ్ ఆఫీసర్లు శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, సమీయొద్దీన్, ఎన్ శ్రీనివాస్, సీహెచ్‌ఎన్ దేవన్న, పీహెచ్‌ఎన్ భారతలక్ష్మి, సూపర్‌వైజర్లు పద్మలత, పుష్ప, ఫార్మసిస్ట్ గిరిధర్, ల్యాబ్ టెక్నీషియన్ విజయ, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

సారంగాపూర్, మే 24: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్, సహకార సంఘం అధ్యక్షుడు ముప్పాల రాంచందర్ రావు పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ సీఈవో తిరుపతి, తదితరులున్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

కోరుట్ల, మే 24: పట్టణంలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక మాస్టో జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1213 మంది విద్యార్థులకు గానూ 1110 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారులు తెలిపారు.

గ్రామాల్లో డ్రైడే

కోరుట్ల రూరల్, మే 24: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. మురుగు కాలువల్లో చెత్తను తొలగించి, డంప్ యార్డుకు తరలించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్యాల ఎంపీపీగా రవళి

మల్యాల, మే 24: మల్యాల ఎంపీపీగా మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ-1 రవళి ఎన్నికైనట్లు ఆర్డీవో, ఎన్నికల అధికారి పులి మధుసూదన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నూతన అధ్యక్షురాలి నియామకానికి ఎన్నిక నిర్వహించగా, 14 మంది ఎంపీటీసీలకు గానూ ఎనిమిది మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంపీపీగా రవళిని ఎన్నుకునేందుకు తాటిపల్లి ఎంపీటీసీ దొంగ అనిత ప్రతిపాదించగా, రాంపూర్ ఎంపీటీసీ క్యాతం పద్మ బలపరిచారు. ఎంపీపీ ఎన్నికకు ఒకే నామినేషన్ రావడంతో రవళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రవళికి నియామక పత్రం అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రవళికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సమక్షంలో ఎంపీపీ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఎంపీటీసీలు మరాఠి సంజన, సఫియా బేగం, మారంపల్లి నర్సమ్మ, పోతాను రవి, ఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీగా రవళితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆర్డీవో పులి మధుసూదన్

చురుగ్గా రాజన్న ఆలయ రాజగోపుర నిర్మాణం

పెగడపల్లి, మే 24: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయం ఎదుట రాజ (గాలి) గోపురం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాదాయ శాఖ నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసింది. గతేడాది పనులను కొప్పుల ఈశ్వర్ ప్రారంభించగా, ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి.

నిర్మిస్తున్న రాజగోపురం

నమస్తే తెలంగాణ CLASSIFIED

సంపాదించుకోవచ్చు

★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం॥ చేతివ్రాత ద్వారా నెలకు 10 వే॥ల నుండి 15 వే॥ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-311319

CHANGE OF NAME

★మోతె చందు, తండ్రి సమ్మయ్య, గ్రామము కొత్తపల్లి అను నేను నా పేరును మోతె చంద్రశేఖర్‌గా తేది. 24-05-2024 రోజున మార్చుకొనుచున్నాను. ఇక మీదట మోతె చంద్రశేఖర్ గా కొనసాగించబడును.
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

అన్నదానం

అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోరుట్ల, మే 24: స్థానిక ప్రభుత్వ ఏరియా దవాఖాన ఆవరణలో పట్టణానికి చెందిన వనపర్తి రాజయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారులు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, లింగయ్య, ఆంజనేయులు 200 మందికి అన్నదానం, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఉషాకిరణ్, మహేందర్, కృష్ణ ప్రసాద్, శివ శ్రీనివాస్, శోభ, మధు, ప్రవీణ్, జగన్, సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంపై దృష్టి సారించాలి

వర్మీ కంపోస్ట్ ఎరువును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కనకదుర్గ

పెగడపల్లి, మే 24: గ్రామ పంచాయతీలు స్థానికంగా లభించే వనరులతో అదనపు ఆదాయంపై దృష్టి సారించాలని డీఎల్‌పీవో కనకదుర్గ సూచించారు. పెగడపల్లి గ్రామ పంచాయతీని శుక్రవారం ఆమె సందర్శించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తయారు చేసిన వర్మీ కంపోస్ట్ ఎరువును పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కారోబార్ స్వామి పాల్గొన్నారు.

'భేటి బచావో-భేటి పడావో'పై అవగాహన

జగిత్యాల రూరల్, మే 24: మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో శుక్రవారం జిల్లా మహిళా సాధికారత బృందం ఆధ్వర్యంలో మహిళలకు భేటిబచావో-భేటిపడావో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత బృందం సభ్యులు, అధికారులు మాట్లాడుతూ, భేటి బచావో-భేటి పడావో, సుకన్య సమృద్ధి యోజనా, బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో రమాదేవి, ఏపీవో గంగలక్ష్మణ్, ఫీల్డ్ ఆఫీసర్ రేవతి, మహిళా సాధికారత బృందం సభ్యులు గౌతమి, హిమశ్రీ పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రమాదేవి

దరఖాస్తుల ఆహ్వానం

పెగడపల్లి, మే 24: మండలంలో పండ్ల తోటల పెంపకానికి గానూ ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గానూ చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెంది, 2.5 ఎకరాల్లోపు వ్యవసాయ భూమి, నీటి వసతి, ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న రైతులు అర్హులని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రమాదవశాత్తు శ్రీగంధం తోట దగ్ధం

సారంగాపూర్, మే 24: నేచపల్లి గ్రామానికి చెందిన ఎడమల తిరుపతి రెడ్డి మూడెకరాల్లో శ్రీగంధం తోట సాగు చేస్తుండగా శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. సుమారు 900 చెట్లతో పాటు రూ. లక్ష విలువైన పైపులు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. సుమారు రూ. 15 లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే, తోట పక్కనే ఉన్న కందుకూరి తిరుపతికి చెందిన డ్రిప్ పైపులు, పాకాల నడిపి నర్సయ్యకు చెందిన ఎకరం పది గుంటలు, పాకాల చిన్నమల్లయ్యకు చెందిన ఎకరం పది గుంటల్లో నాటిన శ్రీగంధం చెట్లు కాలిపోయాయి.

భూసారంతోనే మేలైన దిగుబడి

రాయికల్, మే 24: భూసారంతోనే మేలైన దిగుబడి వస్తుందని ఎరిస్ ఆగ్రో ప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎరిస్ ఆగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం భూసార పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, ఎరిస్ ఆగ్రో ప్రతినిధులు రాజుభరత్, మనోహర్, తిరుపతి, నరేశ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

మల్లాపూర్, మే 24: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గ్రామంలోని ఓ గార్డెన్స్‌లో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం, మే 24: ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి, తహసీల్దార్ ప్రసాద్ సూచించారు. వర్షకొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వారు పరిశీలించి, మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. నాయకుడు జగన్‌రావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

జగిత్యాల రూరల్, మే 24: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా సెర్ప్ డీపీఎం చరణ్‌దాస్ ఆదేశించారు. జగిత్యాల మండల సమైక్య కార్యాలయంలో శుక్రవారం ఆయన జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం చరణ్‌దాస్ మాట్లాడుతూ, జగిత్యాల రూరల్ మండలంలో 890 సంఘాలకు రూ. 55.11 కోట్లు, అర్బన్ మండలంలో 169 సంఘాలకు రూ. 9.92 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు కేటాయించినట్లు తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'మైనార్టీ గురుకులం'లో పిల్లలను చేర్పించాలి

మారుతీనగర్, మే, 24: పట్టణంలోని మైనార్టీ గురుకులంలో పిల్లలను చేర్పించాలని ప్రిన్సిపాల్ తిరుపతి కోరారు. పట్టణంలోని ముస్లింలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. పాఠశాలలో వసతులు, విద్యా బోధన తీరును వివరించారు.

మామిడి మార్కెట్‌లో వసతుల కొరత

జగిత్యాల, మే 24: జగిత్యాల మామిడి మార్కెట్‌లో రైతులకు వసతులు లేవని సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని మామిడి మార్కెట్‌ను శుక్రవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి సందర్శించారు. రైతులు, కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెన్న మహేశ్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి మృతదేహం

మేడిపల్లి, మే 24: భీమారం మండలం మోత్కురావుపేట గ్రామానికి చెందిన భూమల్ల గణేశ్ (27) మూడు నెలల క్రితం బతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ రోడ్డుపై గల మ్యాన్‌హోల్‌లో ప్రమాదవశాత్తు గణేశ్ పడిపోయి మృతి చెందాడు. కాగా, విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో గణేశ్ మృతదేహం శుక్రవారం ఇంటికి చేరింది. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

- చోరీల నివారణకు నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలి
- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ • వ్యవసాయ, పోలీసు అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాల కలెక్టరేట్, మే 24: జిల్లాలో నకిలీ విత్తనాల చలామణిని పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసు అధికారులు కట్టుదిట్టమైన నిఘాను ఏర్పాటు చేయాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన జిల్లాలో నకిలీ విత్తనాల క్రయవిక్రయాల అడ్డుకట్ట, నెల వారి నేరాలపై వ్యవసాయాధికారులు, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. బీజీ 3 పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే రసీదు తీసుకోవాలన్నారు. నేరాలు, చోరీల నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వరరావు, రంగారెడ్డి, వ్యవసాయాధికారులు, డీసీఆర్‌బీ, సీసీఎస్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఫీక్‌ఖాన్, సీఐలు, ఎస్